సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 4 । మార్చి । 2024



## కాంగ్రెస్‌తోనే న్యాయం

కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 8లో▸



## దేవాలయాలే టార్గెట్

దేవాలయాలను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని ఆదిబట్ల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 8లో▸



## చేవెళ్ల షి'కారు'పై సందిగ్ధం!

చేవెళ్లలో బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పోటీ విషయంలో జోరుగా చర్చ జరుగుతోంది. 8లో▸

## న్యూస్‌రీల్

### నేటి ప్రజావాణి రద్దు

ఇబ్రహీంపట్నం రూరల్: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక.. గ్రామాల్లో ధరణి సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజావాణిని ఈ వారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శశాంక ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

### నేడు 'పార్లమెంట్ ఎన్నికలు-వైశ్యుల పాత్ర'పై చర్చాగోష్ఠి



హుడాకాంప్లెక్స్: 'పార్లమెంటు ఎన్నికలు- వైశ్యుల పాత్ర'పై సోమవారం ఉదయం 10.30 గంటలకు కర్మన్‌ఘాట్‌లోని లక్ష్మీ కన్వెన్షన్‌లో చర్చాగోష్ఠి ఉంటుందని వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ లయన్ డా. కాచం సత్యనారాయణగుప్తా తెలిపారు. చైతన్యపురిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు వైశ్యులను ఓటు వేసే యంత్రాలుగానే చూస్తున్నాయే తప్ప రాజ్యాధికారంలో భాగం చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ ఎన్నికల్లో అయినా పార్టీలు కనీసం వైశ్యులకు రెండు టికెట్లు కేటాయించాలని, రూ.వెయ్యి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### పహాడీ షరీఫ్ దర్గాలో ఎంపీ రంజిత్ ప్రార్థనలు



దర్గాలో పూలు సమర్పిస్తున్న ఎంపీ రంజిత్ రెడ్డి

పహాడీషరీఫ్: పహాడీ షరీఫ్ దర్గా 758వ ఉర్సు షరీఫ్ ఉత్సవాల్లో భాగంగా చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి.రంజిత్ రెడ్డి ఆదివారం రాత్రి పూలు, చాదర్ సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, కొండల్ యాదవ్, రాజేష్, ఎక్బాల్ ఖలీఫా తదితరులు పాల్గొన్నారు.

### చివరి దశలో 'వర్గీకరణ'

- కల నెరవేరే సమయం ఆసన్నమైంది
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చేవెళ్ల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో వర్గీకరణ అంశం చివరి దశకు చేరుకుందని సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.ప్రశాంత్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు మాదిగ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన మండలాల ప్రధాన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్గీకరణ కల నెరవేరేందుకు చేరువలో ఉందని.. దీనిని సాధించి తీరాల్సిందేనని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో కాలయాపన చేసిందని.. బీజేపీ ప్రభుత్వంలో ప్రధాని మోదీ సహకారంతో వర్గీకరణకు అడుగులు పడుతున్నాయన్నారు. అందుకే మాదిగలంతా కలిసి ఏకతాటిపై నిలబడి మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 12న చేవెళ్ల పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి మందకృష్ణ మాదిగ హాజరవుతారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింలు, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు నగరానికి ప్రధాని రాక

సనత్‌నగర్: ఈ నెల 4, 5 తేదీల్లో ప్రధాని మోదీ నగర పర్యటన నేపథ్యంలో సిటీ ట్రాఫిక్ పోలీస్ విభాగం అప్రమత్తమైంది. ప్రధాని వెళ్లే మార్గాల్లో వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణకు సన్నద్ధమైంది. ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రధానమంత్రి పర్యటన వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. సోమవారంరాత్రి 7.40 నుంచి 8.10 గంటల మధ్య ప్రధాని మోదీ బేగంపేట విమానాశ్రయం నుంచి రాజ్‌భవన్‌కు చేరుకుంటారు.



హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్న వాహనదారులు



హెల్మెట్‌లు పంపిణీ చేస్తున్న, రోడ్ సేఫ్టీ అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్

# రైడ్ టు సేఫ్టీ

మీర్‌పేట: ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని రోడ్ సేఫ్టీ అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్ సూచించారు. ఐసీఐసీఐ లాంబార్డ్, ట్రాక్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని లార్డ్స్ స్కూల్ వద్ద చేపట్టిన 'రైడ్ టు సేఫ్టీ' ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులు, తల్లిదండ్రులకు 818 హెల్మెట్‌లను పంపిణీ చేశారు. అనంతరం జెండాఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్‌లు ధరించకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయాలై చాలా మంది ప్రాణాలు కోల్పోయి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఒక్క 2022 సంవత్సరంలోనే రాష్ట్రంలో 3 వేల మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది మొబైల్, మద్యంతాగి, సీటు బెల్టు పెట్టుకోకుండా, రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేస్తున్నారని.. ఇది చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ కొన్నాక భద్రత కోసం స్క్రీన్‌గార్డు, పౌచ్ ఎలా కొనుగోలు చేస్తారో.. వాహనం నడిపేటప్పుడు అలాగే హెల్మెట్ ధరించి నడపాలని సూచించారు. ఐసీఐసీఐ లాంబార్డ్ వారు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఐసీఐసీఐ లాంబార్డ్ ప్రతినిధి సుమిత్‌శర్మ, ట్రాక్ సంస్థ ప్రతినిధులు కులుశ్రేష్ఠ, రాజ్‌నాథ్‌శర్మ, రజినీగాంధీ, మీర్‌పేట సీఐ కాశీవిశ్వనాథ్, సిల్వర్ డ్రాప్స్ విద్యాసంస్థల చైర్మన్ జె.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉ'సిరి'



ఓ ఉసిరి చెట్టు విరగకాసి చూపరులను ఆకట్టుకుంటోంది. షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన దాదె అమృత్ రాజ్ ఇంటి వద్ద పెంచుకున్న ఉసిరి చెట్టుకు మొదలు నుంచి చివరి కొమ్మల వరకు కాపు విరగకాసింది. అటువైపు వెళ్లేవారు దీనిని ఆసక్తిగా వీక్షిస్తున్నారు.

– షాబాద్

# పేదల బియ్యం పక్కదారి!



మైలార్‌దేవ్‌పల్లి టాటానగర్‌లోని ఓ మల్టీరైస్ ప్యాకింగ్ సెంటర్‌లో తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల నుంచి సోనామసూరి, బాస్మతి రైస్‌ను దిగుమతి చేసుకుని, ఎవరికీ అనుమానం రాకుండా వాటిలో పాలిష్ చేసిన రేషన్ బియ్యం కలిపి ప్యాకింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల టాస్క్‌ఫోర్స్ అండ్ విజిలెన్స్ అధికారులు ఈ కేంద్రంపై దాడి చేశారు. లూజు బియ్యంతో పాటు మల్టీ బ్రాండెడ్ లేబుళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో పీడీఎస్ బియ్యం కలిపి ప్యాక్ చేస్తున్నట్లు గుర్తించారు. నిల్వ ఉంచిన బియ్యం బస్తాల నుంచి శాంపిల్‌ను సేకరించి పరీక్ష కోసం పంపారు. కేవలం మైలార్‌దేవ్‌పల్లిలోనే కాదు పేదలు ఎక్కువగా నివసించే హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయంజాల్, కర్మన్‌ఘాట్, చంపాపేట్, రాజేంద్రనగర్, శంషాబాద్, మొయినాబాద్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, గండిపేట సహా పలు బస్తీల్లో ఇదే తరహా దందా కొనసాగుతోంది.

**యథేచ్ఛగా రైసు మిల్లులకు తరలింపు**

- సోనామసూరి, బాస్మతిలో మిళితం
- బ్రాండెడ్ లేబుల్స్‌తో ప్యాకింగ్
- గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పేదల బియ్యం పక్కదారి పడుతున్నాయి. గోదాం ఇన్‌చార్జిలు, రేషన్ డీలర్ల నుంచి తక్కువ ధరకు వీటిని కొనుగోలు చేసి గుట్టుగా మిల్లులకు తరలించి సన్నగా పాలిష్ చేయిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఖరీదైన బాస్మతి, సోనామసూరిలో కలుపుతున్నారు. బ్రాండెడ్ లేబుల్స్ బ్యాగుల్లో నింపి గుట్టుగా విక్రయిస్తున్నారు. సన్నగా, తెల్లగా నిఘనిఘలాడే ఈ బియ్యాన్ని కొనుగోలు చేసినవారు తీరా వండిన తర్వాత మోసపోయామని గ్రహించి చేసేది లేక ఉసూరుమంటున్నారు. ఎప్పటికప్పుడు ఆయా గోదాములు, రైసు మిల్లులు, రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి సరఫరా, నిల్వలు, పంపిణీ వంటి అంశాలను పరిశీలించాల్సిన జిల్లా సివిల్ సప్లయ్, విజిలెన్స్ అధికారులు వారిచ్చే కాసులకు కక్కుర్తిపడుతూ అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

**సన్నగా మార్చి.. ఏమార్చి**

జిల్లాలో అంత్యోదయ కార్డులు 33,481 ఉండగా, వీటిలో 91,356 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఆహార భద్రత కార్డులు 5,24,918 ఉండగా, వీటిలో 17,31,750 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇక అన్నపూర్ణ ఆహార భద్రత కార్డులు 39 ఉండగా, 53 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఆయా లబ్ధిదారులందరికీ నెలకు సగటున 11,562.725 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతున్నాయి. 932 చౌక ధరల దుకాల ద్వారా వీటిని అందజేస్తున్నారు. ఈ బియ్యాన్ని తినేందుకు మెజార్టీ ప్రజలు ఇష్టపడటం లేదు. కార్డు తొలగిస్తారనే భయంతో ఇష్టం లేకపోయినా రేషన్‌షాపుల నుంచి తీసుకెళ్తున్నారు. దోష, ఇడ్లీ, ఇతర పిండి వంటలకు సరిపడా బియ్యం ఉంచుకుని, మిగిలిన వాటికి కిలో రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఈ బియ్యాన్ని సమీపంలోని రైస్‌మిల్లులకు తరలించి, సన్నగా పాలిష్ చేస్తున్నారు. చూసేందుకు సోనా మసూరి బియ్యంలా మార్చేస్తున్నారు. గుట్టుగా వీటిని లేబుల్ ప్యాకింగ్ బస్తాల్లో నింపి, మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

**అధికారుల కనుసన్నల్లోనే..?**

సివిల్ సప్లయ్ అధికారులు ఎప్పటికప్పుడు ఆయా గోదాములు, రైస్ మిల్లులు, చౌక ధరల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. లేవీ సేకరణ, సరఫరా, నిల్వలు, పంపిణీ లెక్కలను పరిశీలించాల్సి ఉంది. డీలర్లు, రైస్ మిల్లుల యజమానులతో కుమ్మక్కయిన అధికారులు పట్టించుకోకపోవడంతో పేదల రేషన్ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు అడపాదడపా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. 2022లో 300 కేసులు నమోదు చేసి, రూ.1,81,03,125.44 విలువ చేసే 12,106.35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 2023లో 145 కేసులు నమోదు చేసి, 4,378.61 మెట్రిక్ టన్నులు స్వాధీనం చేసుకున్నారు.

**బస్తాకు ఐదు కిలోలు తక్కువ**

జిల్లా వ్యాప్తంగా 17 రైస్ మిల్లులు ఉన్నాయి. వీటి నుంచి సేకరించిన బియ్యాన్ని తొమ్మిది కేంద్రాల్లో నిల్వ చేస్తుంటారు. పేదలకు ఉచితంగా అందజేస్తున్న ఈ బియ్యాన్ని వ్యాపారుల నుంచి కిలో రూ.32కు కొనుగోలు చేసి గోదాముల నుంచి రేషన్‌షాపులకు బియ్యం తరలిస్తారు. అటు నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. గోదాముల నుంచి రేషన్‌షాపులకు బియ్యం బస్తాలను తరలించే క్రమంలో ఒక్కో బస్తాలో ఐదు కిలోలు తక్కువ వస్తున్నట్లు డీలర్లు చెబుతున్నారు. ఇదే అంశంపై ఇటీవల కిస్మత్‌పూర్ సివిల్ సప్లయ్ గోదాంలో విజిలెన్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. నెలనెలా పంపుతున్న ఇండెంట్లకు, సరఫరా చేసిన సరుకులకు .. గోదాంలోని నిల్వలకు పొంతన లేకపోవడంతో తనిఖీలకు వచ్చిన విజిలెన్స్ అధికారులు నివ్వెరపోవాల్సి వచ్చింది.

# దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న కేంద్రం

- రాజకీయ ప్రత్యర్థులపై కావాలనే దాడులు
- కేసీఆర్ అవినీతిపై విచారణ చేసే దమ్ముందా?
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

షాద్‌నగర్: కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీలతో బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులపై ముప్పేట దాడులు చేయిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. షాద్‌నగర్ పట్టణంలోని ఎన్‌హెచ్ 44దాబా వద్ద ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రం దర్యాప్తు సంస్థలను తమ చెప్పుచేతల్లో పెట్టుకుందని.. రాజకీయంగా తమకు ఎదురుండొద్దనే ఉద్దేశంతో ప్రతిపక్ష పార్టీల నేతల ఇళ్లపై దాడులు, అరెస్టులు చేయిస్తోందని ఆరోపించారు. కేసీఆర్ చేసిన అవినీతిపై విచారణ చేసే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులను అరెస్టు చేసి జైల్లో పెడతామని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా చెప్పారని, మరి ఎందుకు వదిలేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటే అయినందుకే కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకునేందుకు వెనుకంజ వేస్తోందని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టును తమ పార్టీ నేతలందరు కలిసి చూసేందుకు వెళితే బొందల గడ్డను చూసి ఏం పీకుతారన్న మాజీ సీఎం కేసీఆర్.. మరి బీఆర్ఎస్ నేతలు ఏం పీకడానికి వెళ్లారని నిలదీశారు. మేడిగడ్డను బొందల గడ్డగా మార్చిన ఘనత ఆయనకే దక్కిందని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 90 రోజులు పూర్తయిందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల్లో దాదాపు అన్నింటినీ త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చబోతున్నారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజలకిచ్చిన మాటకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ బద్ధ శత్రువు కేంద్ర మంత్రి అమిత్‌షా అని మంత్రి పొన్నం విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణను వ్యతిరేకించిన వ్యక్తి ఇప్పుడు తెలంగాణకు ఏం న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# పోలియో మహమ్మారిని తరిమికొట్టాలి

**కలెక్టర్ శశాంక**

ఇబ్రహీంపట్నం రూరల్: పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీలోని పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 0–5 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి వారందిరికీ పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. ఆదివారం వేయించుకోలేని పిల్లలకు సోమ, మంగళవారాల్లో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరావు, డాక్టర్ స్వర్ణకుమారి, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**భవిష్యత్ తరానికి ఆరోగ్యం**

చేవెళ్ల: పోలియో చుక్కల ద్వారా భవిష్యత్ తరానికి ఆరోగ్యాన్ని అందించినవారమవుతామని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. డివిజన్ ఉప వైద్యాధికారి దామోదర్‌తో కలిసి ఆదివారం డివిజన్‌లోని పలు పీహెచ్‌సీలను తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. అన్ని కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనివార్య కారణాలతో ఎవరైనా పిల్లలు వేయించుకోలేని పక్షంలో సోమ, మంగళవారాల్లో గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ శశాంక

# పక్కాగా 'జీరో' అమలు

- నిమగ్నమైన జిల్లా యంత్రాంగం
- ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారి కోసం మరో అవకాశం
- నేటి నుంచి స్పెషల్ కౌంటర్లు
- అమలులో సమస్యలున్నా పరిష్కారం

షాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఆరుగ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులందరికీ 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అమలుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. జిల్లాలో 48,805 మంది దరఖాస్తు చేసుకోగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో అర్హుల జాబితాను పొందుపర్చారు. ఈ నెల నుంచే పథకం అమలు చేస్తున్నారు. జిల్లాలో గృహ విద్యుత్ కనెక్షన్లు 96,348, వ్యవసాయ కనెక్షన్లు 49,693, పరిశ్రమల కనెక్షన్లు 605 ఉన్నాయి. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అమలుకు ప్రజాపాలనలో 48,805 మంది దరఖాస్తు చేసుకున్నారు. విద్యుత్ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించారు. గృహ యజమానులు అందజేసిన ప్రజాపాలన దరఖాస్తుల నంబరు, రేషన్, ఆధార్, మొబైల్ నంబర్ తదితర వివరాలు సేకరించి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చారు. ఫిబ్రవరిలో వినియోగించుకున్న గృహాలకు ఈ నెల నుంచి జీరో బిల్లు అందజేస్తున్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు సైతం ఈ బిల్లులో పొందుపరచనున్నారు. లబ్ధిదారులు పెండింగ్ బిల్లులు చెల్లించాలని విద్యుత్ సిబ్బంది సూచిస్తున్నారు.

**కిరాయిదారులకు సైతం**

జిల్లా, మండల కేంద్రాల్లో చాలా మంది అద్దెకుంటున్నారు. ఇంటి యజమాని పేరిట విద్యుత్ కనెక్షన్ ఉంటుంది. ఇలాంటి సమయంలో అధికారులు అద్దె ఇంట్లో ఉండే వారి రేషన్, ఆధార్ వివరాలను ఆ ఇంటి యజమాని కనెక్షన్‌కు జోడించారు. ఇంటి యజమాని మరణించిన ఇంట్లో ఉండే కుటుంబసభ్యులకు ఉచిత విద్యుత్ పథకం వర్తింపజేయనున్నారు.

**పెండింగ్ బిల్లులు చెల్లించే అవకాశం**

బిల్లులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి అర్హులవుతారని అధికారులు చెబుతున్నారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వాయిదాల రూపంలో చెల్లించే అవకాశం కల్పించినట్టు చెబుతున్నప్పటికీ పెండింగ్ బిల్లులుంటే ఉచిత విద్యుత్ పథకం వర్తించదన్న వదంతులు మొదలయ్యాయి. ఈ క్రమంలో నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వినియోగదారులు చెల్లించేందుకు మొగ్గు చూపుతున్నారు.

**నేటి నుంచి ప్రత్యేక కౌంటర్లు**

ఉచిత విద్యుత్ పథకంలో అమల్లో భాగంగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారి కోసం సోమవారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరించనున్నారు. జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.



ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది (ఫైల్)

**"వివరాలు సేకరించాం**

గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి నుంచి సిబ్బంది వివరాలు సేకరించారు. వారి వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచాం. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారికోసం ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. అమలులో సమస్యలున్నా కౌంటర్లలో పరిష్కరిస్తాం.

– శివశంకర్, విద్యుత్ శాఖ డీఈఈ

# చేవెళ్ల షి'కారు'పై సందిగ్ధం!

- రంజిత్‌రెడ్డి పోటీకి వెనుకాడుతున్నట్లు ప్రచారం
- పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వైనం



గడ్డం రంజిత్‌రెడ్డి, ఎంపీ

**చేవెళ్ల:** చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థులను ఆయా పార్టీలు ప్రకటిస్తుండటంతో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పోటీ విషయంలో జోరుగా చర్చ జరుగుతోంది. సిట్టింగ్ ఎంపీగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి ఉన్నారు. ఆయనకే మళ్లీ పార్టీ టికెట్ ఇస్తుందని ముందుగానే ప్రకటించారు. రంజిత్‌రెడ్డి పోటీలో ఉంటే చేవెళ్లలో ఎంపీగా గెలుపు ఖాయమనే మొదట్లో చర్చ సాగింది. ప్రస్తుతం ఆయన బరిలో ఉంటారా ఉండరా అనే సందిగ్ధం నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల తరువాత అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం రావటంతో చేవెళ్ల రాజకీయాలు రోజు రోజుకు మారిపోతున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లోకి జంప్ చేస్తున్నారు. దీనికి తోడు చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్ పార్టీ నుంచి పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఆమె పేరునే దాదాపు పార్టీ ప్రకటించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీలో కలిసి ఉన్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, రంజిత్ రెడ్డిలు ప్రత్యర్థులు అయ్యే అవకాశం ఉంది. ఇరువురూ వ్యాపారాలు కూడా కలిసే చేస్తున్నారు. చేవెళ్లలోని మెడికల్ కళాశాలలో ఇద్దరి భాగస్వామ్యం కూడా ఉండటంతో ఇప్పుడు ఎంపీ పోటీలో వీరిద్దరే ప్రత్యర్థులుగా ఉండేందుకు ఇష్టపడటం లేదు. పార్టీలు వేరవడంతో అభ్యర్థులు వీరే అవుతున్నారు. అందుకే బీఆర్‌ఎస్ నుంచి ఎంపీ రంజిత్‌రెడ్డి పోటీ చేసేందుకు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం.

**మౌనంగానే ఎంపీ**

కాంగ్రెస్‌పార్టీలో సునీతా రెడ్డి, మహేందర్‌రెడ్డి వర్గీయులు చేరిన నాటి నుంచే చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డి మౌనం వహించారు. దీంతో ఆయన వారిపై పోటీలో ఉండే అవకాశాలు లేవని జోరుగా చర్చ సాగుతోంది. రంజిత్‌రెడ్డి కాకపోతే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీలో ఎవరు ఉంటారనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. దీనిపై కూడా నియోజకవర్గంలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీని వీడే నాయకుల విషయంలో ఎలాంటి స్పందన లేకపోవటంతో పాటు వారిని మరవద్దని కూడా చెప్పకపోవటంతో పార్టీ కార్యక్రమాలు కూడా పెద్దగా చేపట్టకపోవటంతో ఆయన పోటీకి వెనకడుగు వేస్తున్నారనే వార్తలను నిజం చేస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరు ఖరారైంది. అయితే ఇక కాంగ్రెస్ అభ్యర్థిగా సునీతా రెడ్డి పేరును అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. బీఆర్‌ఎస్ నుంచి ప్రకటించిన రంజిత్‌రెడ్డి పరిస్థితి అగమ్యగోచరంగా మారటంతో కారుపార్టీ గందరగోళంలో పడింది. రంజిత్‌రెడ్డి సైతం పార్టీ మారే ఆలోచనలో ఉన్నాడని నియోజకవర్గంలో ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. నియోజకవర్గాల్లో ఉన్న ఆయన వర్గీయులు సైతం ఈ వార్తలపై ఎలాంటి చర్చలు చేయకుండా మౌనంగా ఉండిపోతున్నారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీలో ఏమి జరుగుతుందని.. ఎంపీ అభ్యర్థిగా ఎవరు ఉంటారనే విషయాలు తెలియక పార్టీ నాయకుల్లో, కార్యకర్తల్లో కూడా అయోమయం అలముకుంది. దీనిపై పార్టీ ఎమ్మెల్యేలు కాని, ఎంపీ కాని ఎలాంటి స్పష్టతను అందించటం లేదని కార్యకర్తలు వాపోతున్నారు. నేడే రేపో కేసీఆర్ ప్రకటించే బీఆర్‌ఎస్ ఎంపీ సీట్ల జాబితాలో చేవెళ్ల ఎంపీ సీటు పేరు ఎవరిది ఉంటుందో చూడాలి.

## కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

**ఆమనగల్లు:** కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో ఆదివారం ఆకుతోటపల్లి చర్చి 100 సంవత్సరాల ఓమ్ మిషన్ సంబురాలు చర్చి పాస్టర్ జి.కె. రూపస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఆకుతోటపల్లి చర్చి అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడంతో అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంబీ సంఘం అధ్యక్షుడు ఆశీర్వాదం, నాయకులు నారాయణ, విజయ్, జగన్, ప్రమోద్, ఎంబీ సంఘం సభ్యులు టైటాస్, బిన్నీ, లాజర్, రామచంద్రయ్య, రాజారత్నం, బుచ్చయ్య, బాలరాజు, విజయ్‌చందర్, కుమార్, చందు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలే టార్గెట్

- అమ్మవారి మంగళసూత్రం ఎత్తికెళ్లిన దొంగ అరెస్టు
- నిందితుడిపై 30 పాత కేసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం రూరల్:** దేవాలయాలను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ఆదివారం తెలిపిన వివరాలు.. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగ్లూర్ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో గతనెల 26న అమ్మవారి మెడలో ఉన్న మంగళసూత్రాన్ని కర్రతో దొంగిలించాడు. దేవాలయంలో ఉన్న సీసీ కెమెరాలను ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. నిందితుడు దొంగతనానికి రెండు రోజుల ముందు రెక్కీ నిర్వహించినట్లు గుర్తించారు. నిందితుడి వివరాలు సేకరించగా సంగారెడ్డి జిల్లా బుద్దేరా గ్రామానికి చెందిన వడ్డే పోషయ్య అలియాస్ రాజుగా గుర్తించారు. ఈనెల 2న నిందితుడిని ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిపై 30 పాత కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బంగారు మంగళసూత్రాన్ని రికవరీ చేశారు. ఈ కేసు ఛేదించిన క్రైం బృందాన్ని సీఐ అభినందించారు.

## పోలియో రహిత సమాజానికి కృషి

### చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్



ఆలయ ప్రాంగణంలో పోలియో చుక్కలు వేస్తున్న అర్చకుడు రంగరాజన్

**మొయినాబాద్:** పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అన్నారు. మండల పరిధిలోని బాలాజీ ఆలయ ప్రాంగణంలో ఆదివారం చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్స్ పోలియో కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రద్దీ ప్రదేశాల్లో పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వం మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాలు, మత్స్యకార ప్రాంతాలలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేయిస్తున్నారన్నారు. తల్లి దండ్రులు కూడా తమ బాధ్యతగా ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో వేయించాలన్నారు. గత మూడేళ్ల పోలియో అదుపులోకి వచ్చిందన్నారు. కానీ ఇటీవల మళ్లీ విజృంభించడంతో టీకాల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో అర్చకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**కొత్తూరు:** రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని మృతదేహం తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై ఉందనే సమాచారంతో అక్కడకు చేరుకున్నారు. సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం ఉంది. పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

## 8 మంది జూదరుల అరెస్టు

### రూ.47,500 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

**మొయినాబాద్:** పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి 8 మంది జూదరులను అరెస్టు చేశారు. వివరాలు.. మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రం షెడ్డులో అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడతోపాటు నగరానికి చెందిన రవి, యాదగిరి, సురేందర్, రాజు, మధు, మహేందర్, అశోక్, నాగరాజు ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు దాడిచేసి ఎనిమిది మందిని పట్టుకున్నారు. వారి దగ్గర ఉన్న రూ.47,500 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించామని.. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



## అతివేగం.. రైతుకు యమపాశం

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



భిక్షపతి (ఫైల్)

**కందుకూరు:** రోడ్డు ప్రమాదం ఆ కుటుంబానికి అంతులేని విషాదాన్ని మిగిలించింది. భర్తను కోల్పోయిన ఆ భార్యను పుట్టెడు దుఃఖంలోకి నెట్టింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కందుకూరుకు చెందిన కొమ్మగళ్ల భిక్షపతి(46) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం ఉదయం బైక్‌పై కందుకూరు చౌరస్తాకు వెళ్తున్నారు. మార్గమధ్యలో మేకల మండి వద్ద ఎదురుగా అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన టిప్పర్ ఆయన నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. టిప్పర్ డ్రైవర్ పీఎస్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సీఐ మక్బూల్‌జానీ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## అర్ధరాత్రి గంధం చెట్ల అపహరణ

### రూ.5 లక్షలకు పైగా నష్టం చేసిన దుండగులు



చౌదర్‌పల్లి గ్రామంలో దొంగలు నరికి ఎత్తుకెళ్లిన గంధం చెట్టు

**యాచారం:** శ్రీ గంధం చెట్ల నరికివేత దొంగల ముఠా శనివారం రాత్రి చౌదర్‌పల్లి గ్రామంలో హల్‌చల్ చేసింది. సాగర్‌రోడ్డుకు సమీపంలో గ్రామానికి చెందిన రంగయ్య వ్యవసాయ పొలంలో ఉన్న గంధం చెట్టును నరికి తీసుకెళ్లడానికి అర్ధరాత్రి వచ్చారు. అదే సమయంలో అటుగా వ్యవసాయ పొలానికి వెళ్తున్న జంగయ్య చెట్టును కొట్టే శబ్దాన్ని విని కేకలు వేశారు. దీంతో దొంగలు రాళ్లురువ్వడంతో జంగయ్య అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే ఆయన 100కు ఫోను చేశారు. పోలీసులు వచ్చే లోపే దొంగలు 15 ఏళ్ల వయసున్న రూ.5 లక్షలకు పైగా విలువ జేసే చెట్లను నరికి తీసుకెళ్లారు. కొద్ది రోజులుగా మండలంలోని నందివనపర్తి, గడ్డమల్లయ్యగూడ, గునుగల్ తదితర గ్రామాల్లోని వ్యవసాయ పొలాల వద్ద ఉన్న శ్రీ గంధం చెట్లను నరికి ఎత్తుకెళ్లడం పరిపాటిగా మారింది. రైతు ఫిర్యాదు మేరకు యాచారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం

### మాజీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానించిన నాయకులు

**చేవెళ్ల:** బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరును ప్రకటించటంతో చేవెళ్లలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద టపాసులు కాల్చి వేడుకలు నిర్వహించారు. చేవెళ్ల మీదుగా వెళ్తున్న విశ్వేశ్వర్‌రెడ్డిని చేవెళ్లలో ఆపి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ.. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని సూచించారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంతర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శర్వలింగం, బీజేపీ నాయకులు వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధుకర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్, నవీన్, జైపాల్, రవి, జగదీశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్, భార్గవ్ తదితరులు ఉన్నారు.

## కోడి పందేలపై పోలీసుల దాడి

**ఇబ్రహీంపట్నం రూరల్:** కోడి పందేలపై పోలీసులు దాడి చేశారు. మూడు కోళ్లు, నగదు స్వాధీనం చేసుకొని, నలుగురిని అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. కుర్మల్‌గూడ శివారు ప్రాంతంలో పందెం కోళ్లను తీసుకొచ్చి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేశారు. రూ.15 వేల నగదు, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలుకు చెందిన తన్నీరు శివ, జడ్చర్లకు చెందిన మీసాల ఆంజనేయులు, తిలక్‌నగర్ కాచిగూడకు చెందిన బచ్చలకూర జంగయ్య, వనస్థలిపురానికి చెందిన బండి రమేశ్‌లను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.